సప్త వాహన దర్శనం భక్త జన సమ్మోహనం


సూర్యప్రభ వాహనంపై స్వామివారు


శేష వాహనంపై..


గరుడ వాహనంపై..


కల్పవృక్ష వాహనంపై..


హనుమంత వాహనంపై..


వెండి రథంలో ఉభయదేవేరులతో చెన్నకేశవస్వామి


చంద్రప్రభ వాహనంపై..

నయనానందం.. భక్తి రస రమ్యం

- తిరుమల తరహాలో రథసప్తమి వేడుకలు
- సప్త వాహనాలపై దర్శనమిచ్చిన చెన్నకేశవస్వామి
- వేలాది భక్తులతో కిక్కిరిసిన మార్కాపురం పురవీధులు
- కనువిందు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు


మార్కాపురం పురవీధుల్లో చెన్నకేశవస్వామి రథోత్సవం

మార్కాపురం/మార్కాపురం టౌన్: రథసప్తమి పర్వదినాన్ని మంగళవారం మార్కాపురం పట్టణంలో అత్యంతం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామివారు వెండి రథంపై కదిలిరాగా భక్తులు కనులారా వీక్షించారు. స్వామివారు వివిధ అలంకారాల్లో సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇల వైకుంఠం తిరుమల తరహాలో నిర్వహించిన రథసప్తమి వేడుకలకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో మార్కాపురం పురవీధులు కిటకిటలాడాయి. సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, యక్కలి కాశీవిశ్వనాథం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఎస్పీ, డీఎస్పీ తదితరులు


భరత నాట్యం చేస్తున్న కళాకారులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుమల తరహాలో మార్కాపురంలో రథసప్తమి ఉత్సవాలను గత 8 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. కేరళ కళాకారుల చండా మేళం, మహిళల కోలాటం, చిన్నారుల భరత నాట్యం, కూచిపూడి ప్రదర్శన, వివిధ వేషధారణలు, పాట కచేరీలు భక్తులకు కనువిందు చేశాయి. డీజే, తీన్మార్ డప్పులు, మంగళవాయిద్యాలతో మార్కాపురం మారుమోగింది.

బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ

చెన్నకేశవస్వామి ఆలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ పూజలు నిర్వహించారు. అనంతరం వాహనసేవలో పాల్గొన్నారు. బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి డీఎస్పీ నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులకు సూచనలిచ్చారు. సప్త వాహన సేవ, రథోత్సవం నేపథ్యంలో మార్కాపురం వై జంక్షన్ నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు.

ఎస్పీ వెంట మార్కాపురం సీఐ సుబ్బారావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాఘవేంద్ర, ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, రాజమోహన్‌రావు, అహరోన్ సిబ్బంది ఉన్నారు. కాగా డివిజన్‌లోని 14 మంది ఎస్సైలు, పలువురు సీఐలు బందోబస్తులో పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో ఎస్పీ సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు.


మహిళల కోలాట ప్రదర్శన


చండా మేళం వాయిస్తున్న కేరళ కళాకారులు


వెండి రథం లాగుతున్న ఎస్పీ దామోదర్, సబ్ కలెక్టర్ త్రివినాగ్, ఎమ్మెల్యే కందుల

భక్తులకు అన్నసంతర్పణ

చెన్నకేశవస్వామి సప్తవాహన సేవ, వెండి రథోత్సవం సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రీడింగ్ రూం ఆధ్వర్యంలో అల్పాహార కార్యక్రమంను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. రాఘవేంద్ర స్వామి గుడి వద్ద 1986–87 జడ్పీ బాయ్స్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. అటవీశాఖ కార్యాలయం వద్ద షిర్డీ సాయిబాబా మందిరం తరఫున సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పేరం సత్యనారాయణ, హరిహరరావు, గోపాలుని కృష్ణమోహన్, గోపిశెట్టి కొండయ్య, బాలాజీ సింగ్, రమణారెడ్డి, సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ పండ్ల అమ్మకందారులు, ఎరువుల దుకాణాల అసోసియేషన్, చెన్నకేశవ స్వామి వారి కల్యాణ సేవా సంఘం, ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పూనర్ గ్రోసరీస్ ఆన్‌లైన్ డెలివరీ ఆధ్వర్యంలో భక్తులకు పానకం, మజ్జిగ పంపిణీ చేశారు. మెయిన్‌బజార్, నెహ్రూబజార్, రాఘవేంద్ర స్వామి గుడి వీధి, నాయుడువీధి, శివాలయం వీధి, అయ్యప్పస్వామి దేవస్థానం, చిన్న రామస్వామి, పెద్ద రామస్వామి దేవస్థానం, రీడింగ్ రూమ్, కొత్త మార్కెట్ తదితర ముఖ్య ప్రాంతాల్లో అన్న సంతర్పణ కౌంటర్లు ఏర్పాటు చేశారు. కాగా మున్సిపల్ కమిషనర్ నారాయణరావు పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అన్నసంతర్పణ శిబిరాల వద్ద ప్రత్యేకంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు. విద్యుత్, ఫైర్, రెవెన్యూ, సెబ్ తదితర శాఖల ఆధ్వర్యంలో రక్షణ చర్యలు చేపట్టారు.


అన్నసంతర్పణ చేస్తున్న సాయిబాబా గుడి నిర్వాహకులు

నవ రథాలపై గోవిందుడు


పొదిలి : సూర్యప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి


కొమరోలు : నవ రథాలపై స్వామివారి గ్రామోత్సవం

కొమరోలు: రథసప్తమి సందర్భంగా మండల కేంద్రమైన కొమరోలులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. స్వామివారిని నవ రథాలపై వివిధ రూపాల్లో కొలువుదీర్చి మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పొదిలి: శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి నగరోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా స్వామి వారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటం, భజనలు, స్వామి వారి కీర్తనల నడుమ నగరోత్సవం సాగింది. ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, అర్చకుడు మురళీకృష్ణమాచార్యులు, మేడా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కొమరోలు : రథంపై ఆశీనులైన వెంకటేశ్వరస్వామి

ఎమ్మెల్యే కందుల తీరు గర్హనీయం

- శ్మశానవాటిక సమస్య పరిష్కరించకుండా ఓ వర్గంపై నిందలేయడం తగదు
- విలేకర్ల సమావేశంలో అన్నా రాంబాబు
- టి.సల్లూరులో బాధిత కుటుంబానికి పరామర్శ

పొదిలి రూరల్: శ్మశానవాటిక విషయంలో రెండు కులాల మధ్య తలెత్తిన సమస్యను సామరస్యంగా పరిష్కరించకుండా, అధికార పార్టీకి కొమ్ముకాసిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా, ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులపై ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పొదిలి మండలం టి-సల్లూరు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎలగాల వెంకటేశ్వర్లు కుటుంబాన్ని అన్నా రాంబాబు పరామర్శించారు. జరిగిన సంఘటన గురించి మృతుడి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం పొదిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గ్రామానికి చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందితే అంతక్రియలను అడ్డుకోవడం ఎంత వరకు సమజంసమని ప్రశ్నించారు. అధికారులు ఒక వర్గం వారికి కొమ్ముకాశారా లేక సమస్యను పరిష్కరించారా అనేది తెలుసుకోవాలని ఎమ్మెల్యేకు హితవు పలికారు. అంత్యక్రియలను అడ్డుకోవడమే కాకుండా మృతదేహాన్ని తీసుకెళ్లి 3 గంటలపాటు అటు ఇటు తిప్పి సమస్యను మరింత జఠిలం చేశారంటూ అధికారుల తీరును తప్పుబట్టారు. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో వైఎస్సార్ సీపీ నాయకులపై నోరు పారేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదన్న విషయాలన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, గుజ్జుల రమణారెడ్డి, సంజీవరెడ్డి, గిరిబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టి.సల్లూరులో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న అన్నా

తలరాత మార్చే చేతిరాత


మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

పొదిలి: పదో తరగతి పరీక్షల్లో మంచి చేతిరాతతో మార్కులు రాబట్టి తలరాత మార్చుకోవచ్చని ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం వసంత పంచమి పూజలు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగానే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. పరీక్షలకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలోఎంఈఓ-2 నాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు కరీమున్ బీబీ, ఉపాధ్యాయులు బీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి


చిత్తడి నేలలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కంభం: చిత్తడి నేలలు జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి ఎంతగానో దోహదపడతాయని క్లస్టర్ కోఆర్డినేటర్ పిచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఉత్తర లేఖన పోటీలు నిర్వహించారు. చిత్తడి నేలల స్వభావం, లక్షణాలు, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. చిత్తడి నేలలను సంరక్షించుకోవాలల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంలో ఘర్షణ

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లికి చెందిన తమ్మిశెట్టి వెంకటస్వామి, తిరుపతమ్మ దంపతులపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి దాడి చేసి గాయపరిచిన సంఘటనపై తర్లుపాడు పోలీసులు విచారణ చేపట్టారు. వెంకటస్వామి ఇంటికి సమీపంలో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. అయితే తన ఇంటి స్థలం రోడ్డు నిర్మాణంలో ఎక్కువగా పోతోందని మేస్త్రీతో వెంకటస్వామి మాట్లాడుతుండగా స్థానికంగా ఉండే యువకుడు వెంకటస్వామి దంపతులపై దాడికి పాల్పడ్డాడు. అకారణంగా తనపై దాడి చేశాడని పోలీసులకు సమచారం ఇవ్వడంతో బాధితుల నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

పోలేరమ్మకు పూజలు


పోలేరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా

రాచర్ల: మండలంలోని గౌతవరం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజవర్గ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు మంగళవారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గౌతవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గౌతవరం, అనుములపల్లె సర్పంచులు మార్తోట లక్ష్మీదేవి, సిరిగిరి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మార్తోట మురళి, షేక్.ఇబ్రాహీం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కంభం: ఇంటర్ విద్యలో మార్పులు, సంస్కరణలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సైమన్ విక్టర్ సూచించారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల 55వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఐఓ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సంకల్ప్ 2025 ద్వారా ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నట్లు వివరించారు. 2025–26 విద్యా సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, వెంకట్రావు, వెంకట నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కమనీయం.. కుసుమ హరనాథుల కల్యాణం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామంలో మంగళవారం కుసుమ హరనాథుల లీలా కల్యాణ మహోత్సవాన్ని భక్తుల కోలాహలం నడుమ నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలుగా పలువురు దంపతులు వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు చీతిరాల నాగేశ్వరరావు, కుసుమాంబ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితుడు శేఖరశర్మ స్వామి వారికి అర్చన, అభిషేకాలు చేసి, కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. ముందుగా భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అన్న సంతర్పణ చేశారు. మహిళా భక్తులకు బహుమతులు అందజేశారు.

జీజీహెచ్‌లో పింఛనర్లకు వైద్య పరీక్షలు

మార్కాపురం: స్థానిక జీజీహెచ్‌లో మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది పింఛనుదారులకు వైద్య పరీక్షలు చేసి, సదరం సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. నేత్ర, అంగవైకల్యాన్ని నిర్ధారించేందుకు పరీక్షలు నిర్వహించినట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శ్రీనివాసరావు, ఆర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోరంజన్, ఆప్తమాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లౌక్య పాల్గొన్నారు.

పానీపూరి బండి వద్ద ఘర్షణ

కంభం: పానీపూరి ఇచ్చే విషయంలో బండి నిర్వాహకుడికి, కొందరు యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలు.. కంభం పట్టణంలోని కందులాపురం కూడలి వద్ద సచివాలయం సమీపంలో ఉన్న పానీపూరి బండి వద్దకు మంగళవారం రాత్రి కొందరు యువకులు వచ్చారు. పానీపూరి తినే సమయంలో యువకులకు, బండి నిర్వాహకుడికి మధ్య వాగ్వివాదం జరిగింది. బండిలో వస్తువులన్నీ యువకులు కిందపడేయడంతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో పానీపూరి నిర్వాహకుడికి, మరో యువకుడికి గాయాలయ్యాయి. తలకు గాయాలైన పానీపూరి బండి నిర్వాహకుడు పోలీసులను ఆశ్రయించాడు.

కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివార్లలోని గుండ్లకమ్మ నది ఒడ్డున జంకె రామిరెడ్డి నగర్‌లో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించగా అర్చకులు శ్రీనివాసచార్యులు, పరాంకుశం కిశోరాచార్యులు, అంగర వెంకట కనక నరసింహాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి తోమాల సేవ, అర్చన, విశ్వక్సేన పూజ నిర్వహించారు. స్వామివారి చిత్రపటాలతో భక్తులు ఆలయంలో ప్రవేశించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేజే నరసింహం, ఏరువ దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

మార్కాపురం: రథసప్తమి సందర్భంగా మార్కాపురం పట్టణంలో మంగళవారం రాత్రి జరిగిన వెండి రథోత్సవంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఎస్టేట్ కు చెందిన పాపిశెట్టి రమాదేవి తన బంధువులతో కలిసి స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు మెయిన్ బజార్ కు వచ్చింది. రథోత్సవం అనంతరం జనంలో నుంచి బయటికి వచ్చి చూసుకోగా తన మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు కనిపించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లారని ఆమె గుర్తించింది. పోయిన గొలుసు విలువ సుమారు రూ.3 లక్షల మేర ఉంటుందని రమాదేవి ఆవేదనతో తెలిపారు. భర్త నాయుడుతో కలిసి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

తర్లుపాడు: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ స్టేషన్ పరిధిలో నేరాలను నియంత్రిస్తూ, శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా పనిచేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. మంగళవారం తర్లుపాడు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖపై ప్రజలకు నమ్మకం కలిగించేలా సిబ్బంది వ్యవహరించాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని నేరాలను నియంత్రించాలని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే పిటిషనర్లతో గౌరవంగా నడుచుకోవాలన్నారు. అనంతరం కేసుల రికార్డులు పరిశీలించి పలు సూచనలిచ్చారు. మిస్సింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఎస్పీ వెంట దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాఘవేంద్ర, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై బ్రహ్మనాయుడు ఉన్నారు.